# బామ్మ - అమ్మమ్మ - కక్కబామ్మ

రచయిత : శ్రీ కవికొండల వేంకటరావుగారు

పైమకుటంలో వివరించిన ముగ్గురు స్త్రీలు నేడులేరు: చనిపోయినారు. ఆఖరు ఆవిడ అంతా ఆరునెలలై కాలం చేసింది. ఆమెతో మా కుటుంబంలోని ఒక తరం స్త్రీ లోకం పూరాగా అంతరించింది అని అనుకోవచ్చు. వాళ్లతోపాటు జ్ఞాపకం వచ్చేవాళ్లు, మా వాళ్లల్లో చని పోయిన ఆడవాళ్లు, ఫక్తు వృద్ధాంగనలు, చాలా మందివున్నారు— వెంకంబామ్మ అనీ, అన్నయ్యమ్మనీ. పల్లప్ప అన్నీ, బాపప్ప అనీ, రాజప్ప అనీ, వీరమ్మమ్మమ్మ అనీ, బుచ్చమ్మమ్మమ్మ గారనీ ఇలాంటి పేర్లతో వారంతా జ్ఞప్తికి రాకమానరు— పుష్కర తర్పణాలప్పు డెక్కడెక్కడి పితాళ్లు కనబడ్డట్టు.

వాళ్లందఱూకూడా డెబ్భై యెనభై మధ్యనో ఇంకా చెప్పొస్తే ఎనభై తొంభై మధ్యనో స్వర్గస్థులైనవారే! వీరిలో ఎవరు పోయినా మేమంతా అనుకొనీ ఓదార్పు మాట వొకటే "ఆవిడకేం తొంభై ఏళ్లావిడ! ఆవిడకేం ఎనభై ఏళ్ల ఆవిడ" అని.

ఏళ్లు! వాటికీ మరణానికి నిత్యసంబంధం ఏదోవుందనుకుంటాను. "అన్నో యేట పోయాడు, ఇన్నో యేట పోయాడు" అని ఏ పోయిన వాణ్ణి గురించి అయినా లెక్కింపక మానం.

నన్నెవరూ పైవాళ్లను గురించి వ్రాయమన లేదు. నేనెవర్నీ పైవాళ్లను గురించి నేర్వమనడం లేదు. కాని ఈలాగు వీరిని గురించి వ్రాస్తూ ప్రచురించడం ఎందుకు వచ్చిందీ అంటే—అది మా "దొడ్డమ్మ—ఆవిడకో డెబ్భైఅయిదేళ్లున్నాయి. పన్ను వొక్కటీ వూడలేదు. పని మునుపటి లాగే చేసుకుంటూ ఇల్లంతా చక్కపెట్టుకుంటుంది—ఆమె ఒకనాడు నాకు చెప్పిన ఈయుదంతాన్ని బట్టి వ్రాయ బుద్ధి పుట్టింది. వ్రాసిన తరువాత నాకు నేను చదువుకోగా అదో సంబుద్ధిలాతోచింది. చనిపోయిన ఆముసీని వాళ్లు తిరిగి ఈ లోకంలో అవతరించారు, వారివారి యౌవనరూపాల్తో, పుణ్య స్త్రీ భావాలతో చెప్పజాలని శిరితో, సంపదతో, సంతోషంతో పెళ్లిళ్ల సంబరాలతో అని అట్టే దివ్యదర్శన మిచ్చినంత వేడుక అయింది.

మా "దొడ్డమ్మ" చెప్పిన ఆయుదంతం నాటికి నేను పుట్టనే లేదట. గోదావరికి ఆనకట్ట కట్టనే లేదట. ఆమె, ఆమె చెల్లెలు, అనగా మా "అమ్మ" ఒకరి కెనిమిదేళ్లు ఒకరికారేళ్లూనట. మా తండ్రి వైపు తాతయ్యలు వెంకయ్యగారు, రామయ్యగారు, అన్నవారు ఆజానుబాహురూపాల్తోను ప్రసిద్ధంగా వెలుగొందేవారట అప్పట్లో. మరీన్ని మా "దొడ్డమ్మ" మామగారు అన్నాయనకూడా దొడ్డవారేనట. మా దొడ్డమ్మకు మా అమ్మకు ఒక్కసారే పెళ్లిళ్లు చేయ నిశ్చయించి మా మాతామహుడు "రామయ్య పంతులుగా"రన్నాయన మగ పెళ్లివారిని, ఇరుతెగల వారిని తర్లిగమ్మన్నారట వారి చిత్తం వచ్చినట్టు!

పాఠకులారా! మీ ఊహా ప్రపంచంలో కనుకట్టుగా వెలిసిందా లేదా ఈపాటికైనా ఆకాలం? ఊహింపగలుగుతున్నారా ఆ మగవాళ్ల వారున్న వూళ్లూ ఆ ఆడ పెళ్లి వారున్న గ్రామమూను?

రాణ్మహేంద్రవరం తాలూకా కానన సీమ కొండల్లో వాండ్రు మగ పెళ్లివాండ్రు. కోనసీమ—అప్పటికి దాన్ని కోనసీమ అనే వారో లేదో నాకు సందేహమే, గోదావరి చివార్ని ఆడపెళ్లివారు. అడవిపుసిరికాయ సముద్రపు వుప్పు అనే సామెత తప్పకుండా తట్టి తీరుతుంది ఆ నాటి ఆ సంబంధ బాంధవ్యాల ఏర్పాట్ను గురించి యోజిస్తే!

ఇలా చెప్పసాగింది మా దొడ్డమ్మ, ఇక్కడనుంచి ఆ చరిత్ర మా కుటుంబంమట్టుకే మంత్రించి: "మీ బామ్మ కక్కబామ్మ ఇద్దఱు తోటికోడళ్లు చెరో మేనా మీద మీ నాన్న వోపట్టుకుచ్చుల పాలకీమీద బ్రహ్మాండంగా తోను, భజంత్రీలతోను తర్లి బయలుదేరి శ్రీరంగపట్నం నుంచి వాకలగరువు దాకా నాటుప్రయాణం గావించి వచ్చారు. బంధువులు ఇరవైరెండు రెండెడ్ల బళ్లమీద, గూటిబళ్లమీద, గంటలు మువ్వలు, గణక్వణ, గణక్వణ అనేలా పెద్ద కోలాహలంగా విచ్చేశారు. దారి పొడుగుతా కాగడాలమీద సిద్దెలతో ఆముదం ఎంత పోసేరో మేరలేదు. ఆ వెలుక్కుముందూ వెనక ముందూ వెన

అయినప్పుడు అంచీఅంచీ వద్ద జాంబాయిగాళ్లు మేనాలు పల్లకీ ఆపేవారు. ఎక్కడికక్కడే చలివేంద్రలు సత్రవులు చలువ పందిరులు సమకూర్చాడు మా తండ్రి. ఊరూరా వీరణాల దిరీసులూడదీసి గోకుతూవుంటే దారి మధ్యను వున్న వూళ్లజనం యొక్క చెవుల్లోని బూజు ఎగిరి పోయుందంటే నమ్ము. ఊరూరు మధ్య రామడోలువాళ్లు బిగులూ దారూ అంటేనాదారు మనుష్యులు కంగారుపడ్డాయా అంటే విశ్వసించు. వాకలగరువంతా ఒకటే పెళ్లివాకిలి, పోకతోటలన్నీ ఒకటే భోగం అట! నిజంగా చెప్పాస్తే మీ బామ్మ చితాభస్మం అప్సరసల బగ్గుండగా మారి వుండదగ్గది: గోదావరిలో కలిపారుగాని." అంది చివరముక్కకూడా తేల్చి మా దొడ్డమ్మ ఆ చరిత్ర విస్తరించి అత్యుత్సాహంగా చెప్పే సమర్థత తనకే గలదన్నట్టు. నేనక్కడుండి వింటూ వున్నాను అన్న సంగతి ఏమరిల్లింది మా పెత్తల్లి.

నేనందుకున్నాను ఆ వెంటనే "లేదమ్మో! మా బామ్మ చితాభస్మం గోదారిలో కలపలేదు. నీ వెరుగవులాగుంది. నీవేదో మా మోలుముక్కగా తెలిసో తెలియకో అనేశావు గోదావరిలో కలిపారు అని, ఆలాకలపబడలేదు ఆమె కాటి భస్మం ఏయేటిలోను.

ఆమె భస్మం అస్థులు అన్నీ కోటిలింగాల గోదావరిలో కలుపుదామని మా వాళ్లు ఏంచాశారూ అంటే—ఒక తాటాకు బుట్టలో పోసి, బెల్లబుట్ట లాగట్టి, అంటే వడపలేసి అన్నమాట, అస్మశానపు జాయలవున్న వెదురు బిడెపు మొదటవుంచారుట, ఆదారే బండిని పోనిచ్చి, మంచి రోజుచూచి బండిమీద పెట్టుకుని రాజమహేంద్రవరం, అంటే ఇక్కడకు తీసికొని వచ్చి కోటిలింగేశ్వరు ప్రోల అఖండ గౌతమిలో కలపాలనే కర్మకాండ కొద్దీని. అయితే ఘోరం జరిగిందీ? తానొకటి తలిస్తే దైవ మొకటి తలిచా డన్నాట్టు వీళ్లు అంటూ మా వాళ్లు, బండిమీద వేసుకుపోదాం అని బుట్ట కోసరని పాద దగ్గఱ కెళ్లే సరికి అక్కడ బుట్టలేదు; బుట్టపోనీ విచ్చిపోయి బూడిదవుందా అంటే అదీ జాడలేదు. పోనీ బూడిద పోయినా ఎముకలుండవా అని వెతకితే అవీ లేవు. బుట్టబుట్టే మాయమై పోయినట్టు కనబడింది. "ఏమైందంటే ఏమైంది బామ్మ భాస్మం" అని అప్పటినుంచీ ఏక ఆలోచనే నా మెదట్లో.

కొందఱు చెప్పారనుకో—దారేపోయే ఏటిపట్టి వాళ్ల వళ్లో అదో బెల్ల బ్బుట్ట అనుకొని, నెత్తికెట్టుకు ఏ అర్థరాత్రో పట్టుకు పోయివుంటారు—అని. అయినా ఆ మాటనే నమ్మలేదు. ఎదో అయివుంటుంది: ఎదో అయివుంటుంది అనే నా యిది. ఎవరెంత చెప్పినా ఎవరేమి చెప్పినా ఆమె చితాభస్మ కైంకర్యవిచింతనం కడంచివర ఆడేటప్పుడల్లా శూన్య దృష్టినలాపడెయ్యడం ఈ సరికే జరిగింది. నీవు చెప్పినట్టు దొడ్డమ్మా! తక్కిన వాళ్లమాట నేను చెప్పలేను గాని మా బామ్మ చితాభస్మం అప్పరసల బగ్గుండగా పైకి నాకలోకానికి వెళ్లి శాశ్వతానందం నిజంగా పొందుతూ వుందనే నా నమ్మకం!"

నేనన్నమాటకే మా దొడ్డమ్మ తన తల తడుముకుంది. వితంతువైనా ఆమె తలకట్టు తీయించు కెరుగదు. తెల్లని నిడుపాటి వెంద్రుకలూ ఆమే తలెత్తి ఆలా తన చిన్నప్పటి రూపం చిత్రించుకోబోలు! "ఒరేయ్! మా తలలమీద ఆ పెళ్లి అయిదో రోజు దండాడింపప్పుడు—మీ బామ్మకు, కక్కుమ్మకు, మా అమ్మకు, నాకు, మీ అమ్మకు అందఱకూ రాగిడీలు, సూరీడు చంద్రూడు, పాపిడి పింద్రీలు, చెవల్నీ జూకాలు, కొప్పులైతే కొప్పుల్లో, జటలైతే జటల్లో, నక్షత్రాలు, మెడల్లో కంటెలు, కాసుల పేర్లు, మొలల్ని వొడ్డాణాలు, ప్రేళ్లనుచుట్లు, కాళ్లను కడియాలు అందెలు పాంజేబులు, ముక్కుల్ని అడ్డబాసలు నత్తులు చేతల్ని కంకణాలు గోజీలు మఱి మేమంతా పెళ్లిళ్ల బగ్గుండదులుపుకుంటూంటే అయిన యీ వస్తువుల చప్పుడంతా యింతా కాదు" అంది మిక్కిలి సరదాగా!

"అదే చప్పుడిప్పుడుకూడా మా బామ్మ చితాభస్మం అచ్చరలు దులుపుకుంటూ గావించేరో! విను!" అని ఆమెను మఱింత హెచ్చరించాను.

★